క్లుప్తంగా

'భగీరథ' నీటిని పొలాలకు ఉపయోగించొద్దు



భగీరథ నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని తపాస్‌పల్లి గ్రామాన్ని మిషన్‌భగీరథ ఈఈ శ్రీనివాస్, డీఈ వేణుగోపాల్, ఏఈ దినేశ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. ఆదివారం గ్రామానికి చెందిన కొంత మంది రైతులు మిషన్ భగీరథ ఏయిర్ వాల్వ్ ఓపెన్‌చేసి తమ పొలాలకు నీటిని మళ్లిస్తున్నట్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు గ్రామానికి వచ్చి ఏయిర్‌వాల్వ్‌ను పరిశీలించారు. అనంతరం గ్రామంలో మిషన్‌భగీరథ నీరు గ్రామస్తులకు ఏవిధంగా అందుతుందో అడిగి తెలుసుకున్నారు. భగీరథ నీటిని పొలాలకు ఉపయోగించకూడదని, ఎవరైనా ఉపయోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీపీఓ దేవకి దేవి, ఆర్‌ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు అందజేత

సిద్దిపేటకమాన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను ఆధునిక టెక్నాలజీ సాయంతో గుర్తించి వన్‌టౌన్ పోలీసులు బాధితులకు అప్పగించారు. సీఐ లక్ష్మీబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన ఆరుగురు వివిధ కారణాలతో తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. అనంతరం వారి ఫిర్యాదుపై పోలీసులు సీఈఐఆర్ యాప్‌లో వివరాలను నమోదుచేసి వాటిని బ్లాక్ చేయించారు. తర్వాత వాటిని గుర్తించి సోమవారం స్థానిక స్టేషన్‌లో బాధితులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



ప్రయాణీలకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: అగ్నిమాపక వారోత్సవాలు సందర్భంగా స్థానిక మోడ్రన్ బస్టాండ్, ఆర్టీసీ డిపోలో ఫైర్ సిబ్బంది ప్రయాణికులకు సోమవారం అవగాహన కల్పించారు. సిద్దిపేట ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కె.నరేశ్ మాట్లాడుతూ వేసవిలో అజాగ్రత్తగా పొగతాగడం వల్ల అగ్ని ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటాయన్నారు. ప్రమాదం జరిగినపుడు నివారణ చర్యలు చేపడుతూనే ఫైర్ స్టేషన్ 87126 99250, లేదా డయల్ 101కు ఫోన్‌చేసి సమాచారం తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది నరేశ్, రవి, యాదగిరి, సంపత్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు జాతీయ పురస్కారం



అవార్డు అందుకుంటున్న రమేశ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేశ్‌కు జాతీయస్థాయి పురస్కారం లభించింది. సోమవారం ఆయన మాట్లాడుతూ ఉగాది క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని జాతీయ తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్ త్యాగరాయ గానసభ వెంటకదీక్షితులు కళావేదికలో ఈ పురస్కారాన్ని అందుకున్నానన్నారు. గ్రామాభివృద్ధి, పరిసరాల పరిశుభ్రత, ఆపదలో ఉన్నవారికి ఆర్థిక సాయం లాంటి సేవలను గుర్తించి ఈ పురస్కారాన్ని ఇచ్చినట్లు చెప్పారు.

స్వచ్ఛ దుబ్బాకే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్



డ్రైనేజీలను శుభ్రం చేయిస్తున్న రమేశ్ కుమార్

దుబ్బాకటౌన్: స్వచ్ఛ దుబ్బాకే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మున్సిపల్ కమిషనర్ రమేశ్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో డ్రైనేజీలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాకను స్వచ్ఛతలో జిల్లాలోనే మొదటి స్థానంలో ఉంచడానికి ప్రజలు సహకరించాలన్నారు. బహిరంగ ప్రదేశాలు, మురుగు కాలువల్లో చెత్తను పారవేస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

బీటీ రోడ్డు నిర్మాణం కలేనా?

- నరకప్రాయంగా చిన్నగుబ్బడి మట్టిరోడ్డు
- రూ.1.50కోట్లతో బీటీ రోడ్డు మంజూరు
- శంకుస్థాపనకే పరిమితం: స్థానికులు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం అంతక్కపేట గ్రామ పరిధిలోని చిన్నగుబ్బడి బీటీ రోడ్డు నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభం అవుతాయోనని స్థానికులు, వాహనదారులు ఎదురుచూస్తున్నారు. బీటీ రోడ్డు మంజూరై నెలలు గడుస్తున్నా ఇంకా పనులు ప్రారంభించకపోవడం ఏమిటని వాపోతున్నారు. ఈ బీటీ రోడ్డు నిర్మాణ పనులకు జనవరి 29న మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. అంతక్కపేట గ్రామం నుంచి చిన్నగుబ్బడి వరకు దాదాపు 2కిలో మీటర్ల మేర నిర్మించే ఈ రోడ్డుకు రూ.1.50కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే రెండు నెలలు దాటుతున్నా కాంట్రాక్టర్ మాత్రం పనులు ప్రారంభించలేదు.

ప్రయాణం.. నరకప్రాయం

ప్రస్తుతం ఉన్న మట్టిరోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా ఉంది. రోడ్డంతా పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. చిన్నపాటి వర్షాలు కురిస్తే చాలు రోడ్డు బురదమయంగా మారుతుందని ప్రజలు, వాహనదారులు వాపోతున్నారు. రాత్రిపూట గుంతలు కనబడక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. బీటీ రోడ్డు నిర్మించి ఇబ్బందులు తీర్చాలని ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని చిన్నగుబ్బడి ప్రజలు అంటున్నారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేశారు.



అంతక్కపేట గ్రామం నుంచి చిన్నగుబ్బడి వరకు వెళ్లే మట్టిరోడ్డు

కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు



బీటీ రోడ్డు నిర్మాణానికి రెండు నెలల కిందట మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. కానీ సదరు కాంట్రాక్టర్ పనులు చేయడం లేదు. వేరేచోట రోడ్డు పనులు జరుగుతున్నాయని చెబుతున్నాడు. టెండర్ ప్రకారం ఏడాదిలోపు బీటీ రోడ్డు పనులు ప్రారంభించకపోతే కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తాం. త్వరలో రోడ్డు పనులు ప్రారంభించేలా చూస్తాం.

– స్నేహ, ఏఈ పంచాయతీరాజ్, అక్కన్నపేట మండలం



మంత్రి శంకుస్థాపన చేసిన శిలాఫలకం



రోడ్డు కోత.. ప్రమాదాల మోత

- భయాందోళనలో వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

అక్కన్నపేట మండలం పోతారం(జే)-ధర్మారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. 8నెలల కిందట కురిసిన వర్షాలకు రోడ్డు కోతకు గురై పెద్దగుంత ఏర్పడింది. అప్పటి నుంచి ఆ రోడ్డును పట్టించుకునే నాథుడులేడు. దీంతో వాహనదారులు నిత్యం ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు. - అక్కన్నపేట(హుస్నాబాద్)

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ ప్రణీత

హుస్నాబాద్‌రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించుకోవాలని ఏఈఓ ప్రణీత పిలుపునిచ్చారు. సోమవారం మహ్మదాపూర్, నాగారం, కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి తెచ్చుకుంటే గిట్టుబాటు ధర వస్తుందన్నారు. రైతులను ఇబ్బందులు పెట్టవద్దని నిర్వాహకులకు సూచించారు. ధాన్యం తెచ్చిన వెంటనే పరిశీలించి వారికి గన్నీ బ్యాగ్స్ ఇవ్వాలని చెప్పారు. వంగరామయ్యపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

హామీలను అమలుచేయాలని ఉత్తరాలు



పోస్ట్‌కార్డులతో నిరసన తెలుపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు

నంగునూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిద్దన్నపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులు పోస్ట్ కార్డులతో నిరసన తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన ఉత్తరాలను సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రూ.500 బోనస్, రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు రూ.15 వేలు, కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక సహాయం చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించినా ఒక్క హామీకూడా నెరవేర్చలేదని వాపోయారు. అందుకే తమ ఆవేదనను సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్ కార్డుల రూపంలో వెల్లడించామని చెప్పారు.

రాఘవాపూర్‌లో...

సిద్దిపేటరూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా రైతు రుణమాఫీ, పలు పథకాలను అమలు చేయాలని కోరుతూ రైతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉత్తరాల ద్వారా విన్నవించారు. సోమవారం మండల పరిధిలోని రాఘవాపూర్ గ్రామంలోని రైతులు మాట్లాడుతూ హామీలను అమలుచేసి, రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాంచందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు యాదయ్య, డైరెక్టర్ తిరుపతి, గ్యార తిరుపతి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

ప్రశాంత్‌నగర్/ సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని బచ్చాయిపల్లి టీఆర్‌ఎస్ అధ్యక్షుడు మల్లయ్య, అలాగే నారాయణరావుపేటకు చెందిన బంధారం రమేశ్‌గౌడ్, నల్ల రాములు, పల్లెబోయిన ఎల్లయ్య, పోలాస కనకరాజు తదితర ఆర్‌ఎస్ నాయకులు సోమవారం పూజల హరికృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. రాములు, రామచంద్రం, బాబేశ్, శ్రీశైలం కలీమొద్దీన్, రామచంద్రం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటరూరల్: కాంగ్రెస్‌లో చేరుతున్న మల్లయ్య

కార్తీకపై వ్యక్తిగత దూషణ సహించం

మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

దుబ్బాకటౌన్: బీఆర్‌ఎస్ నాయకురాలైన కత్తి కార్తీకను కాంగ్రెస్ మహిళా నాయకులు వ్యక్తిగతంగా దూషించడం సహించబోమని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత మండిపడ్డారు. సోమవారం బీఆర్‌ఎస్ క్యాంప్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ మహిళలు, నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లలిత, యాదగిరి, స్వామి, శ్రీనివాస్, రాజలింగం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

సిద్దిపేటజోన్: బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక, మాజీ మంత్రి హరీశ్‌రావును విమర్శించే స్థాయి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు లక్ష్మికి లేదని, వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ మహిళ విభాగం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హరీశ్‌రావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సువర్ణ లక్ష్మి, నర్సమ్మ, నాగమ్మ, సునీత మాట్లాడారు. సాటి మహిళను విమర్శించడం సబబు కాదన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనిత

5 ఇసుక లారీల పట్టివేత

గజ్వేల్‌రూరల్: అనుమతులు లేకుండా ఇసుక రవాణాచేస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. అనుమతులు, వే బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న 5లారీలను సోమవారం రాజీవ్ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద పట్టుకున్నట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అనుమతులు లేకుండా ఇసుక, పీడీఎస్ రైస్ రవాణా చేసినా, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, కలిగిఉన్నా చర్యలు తప్పవన్నారు. సమాచారం ఉంటే 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు తెలియజేయాలని ప్రజలను కోరారు.

అవన్నీ ప్రజలను మోసం చేసిన పార్టీలే

సీపీఎం నేత గోపాలస్వామి



మాట్లాడుతున్న గోపాల స్వామి

కొమురవెల్లి(సిద్దిపేట): బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిన పార్టీలేనని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కాముని గోపాలస్వామి అన్నారు. సోమవారం మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో బోడుగం సురేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సత్తిరెడ్డి, శశిధర్, కృష్టారెడ్డి, యాదవ రెడ్డి, శారద, రవీందర్, ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

దేశం బాగుండాలంటే బీజేపీకే ఓటు వేయాలి

మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

గజ్వేల్‌రూరల్: దేశం బాగుండాలంటే బీజేపీకే ఓటు వేయాలని మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. గజ్వేల్‌లో సోమవారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో భాగంగా ఇందిరాపార్కు చౌరస్తా వద్ద ఆయన మాట్లాడుతూ వెంకట్రామిరెడ్డి 10 ఏళ్ల కలెక్టర్‌గా పనిచేసి రాజ్‌పుష్ప కంపెనీ పేరుతో రూ.100 కోట్లకు ఎకరా చొప్పున 10ఎకరాల భూమిని కొనుగోలు చేశారని విమర్శించారు. కేసీఆర్ కూతురు కవిత ఢిల్లీలో లిక్కర్ వ్యాపారం చేసి జైలు పాలైందని, వారి కాలంలో ప్రతిపక్ష నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేశారని ఆరోపించారు. బీజేపీ 400 సీట్లు గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్, పంజాల అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ రక్తదాన శిబిరంలో పాల్గొనాలని సూచించారు.

దేశ ఖ్యాతిని పెంచిన నరేంద్రమోదీ

బీజేపీ రాష్ట్ర నాయకుడు బాలేశ్‌గౌడ్

దుబ్బాక: ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని పెంచిన ఘనత ప్రధానమంత్రి నరేంద్రమోదీకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు అంబటి బాలేశ్‌గౌడ్ అన్నారు. సోమవారం 38వ బూత్‌లో మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు గెలుపు కోసం ఇంటింటా ప్రచారం చేపట్టారు. ఆయనను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుధారెడ్డి, భాస్కర్, ప్రవీణ్, రమేశ్ రెడ్డి, రమణారెడ్డి, రాజు, నిఖిల్‌రెడ్డి ఉన్నారు.

బండి సంజయ్ విజయం ఖాయం..

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఎంపీగా బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ మరోసారి విజయం సాధించడం ఖాయమని ఆపార్టీ కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని దేవక్కపల్లెలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భూత్ కమిటీ అధ్యక్షుడు బాల్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి, లక్ష్మణ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



దుబ్బాక: ఇంటింటా ప్రచారంలో బీజేపీ నేతలు

దేశానికి మోదీ రక్షణ కవచం..

హుస్నాబాద్: బండి సంజయ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు 19వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ దేశానికి రక్షణ కవచంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో పట్టణ మాజీ అధ్యక్షుడు శంకర్ బాబు, నాగార్జున్, కిషోర్, గణేశ్, శ్రావణ్ కుమార్ తదితరులున్నారు.

ఎంపీ విజయాన్ని గిఫ్ట్‌గా ఇవ్వాలి

ఎన్‌ఎస్‌యూఐ నేత ప్రశాంత్

కొండపాక(గజ్వేల్): మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు గెలుపును కాంగ్రెస్ పార్టీకి గిఫ్టుగా ఇచ్చేలా ఎన్‌ఎస్‌యూఐ కృషి చేయాలని రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రవీంద్రనగర్‌లో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎస్‌యూఐ బలోపేతం కోసం కాంగ్రెస్ సహకరించడంతో పాటు రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్‌కు ఎంఎల్‌సీ పదవిని ఇచ్చిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల మండల ఇన్‌చార్జిలుగా రవి, భానును నియమించినట్టు చెప్పారు.



మాట్లాడుతున్న ప్రశాంత్

బూస్టర్ మోటార్ ఏర్పాటు

- తండాలకు నీటి సరఫరా
- భగీరథ డీఈ బాలరాజ్

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గండిపల్లి గ్రామంలో మిషన్ భగీరథ అధికారులు బూస్టర్ మోటార్‌ను ఏర్పాటు చేశారు. ఈ గ్రామపరిధిలో ఐదారు గిరిజన తండాలు ఉన్నాయి. దీంతో మిషన్ భగీరథ నీళ్ల బోరింగ్‌తండా, సరిరాంతండాలకు సరఫరా చేయడం ఇబ్బందిగా మారింది. దీంతో ఈ తండాలకు భగీరథ నీళ్ల ట్యాంకులకు ఎక్కేలా బూస్టర్ మోటర్‌ను ఏర్పాటు చేసినట్లు భగీరథ డీఈ బాలరాజ్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి తండాతండాలకు భగీరథ నీళ్ల సరఫరా చేస్తున్నామన్నారు. నీళ్లను ఎవరూ వృథా చేయొద్దని సూచించారు.



గండిపల్లిలో ఏర్పాటు చేసిన బూస్టర్ మోటార్

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

కొంగరి వెంకట్‌మావో

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని ఆకునూర్‌లో ధాన్యం కొనగోలు ప్రారంభించాలని సీపీఐ(యం)మండల కార్యదర్శి కొంగరి వెంకట్ మావో డిమాండ్ చేశారు. సోమవారం ఆకునూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇతర నాయకులతో కలసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నామ మాత్రంగా ప్రారంభించారని, తాగునీరు, గన్నీబ్యాగులు, జల్లి మిషన్‌లు అందుబాటులో లేవని వాపోయారు. అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, ఐలయ్య, భూమయ్య, కనకయ్య పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట)లో..

స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో ధాన్యం కొనగోలు వేగవంతం చేయాలని రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి కత్తుల భాస్కర్ రెడ్డి కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి పది రోజులైనా కొనుగోలు ప్రారంభించలేదని మండిపడ్డారు. రాములు, లింగయ్య, మల్లవ్వ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆకునూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బండి సంజయ్‌కు ఓట్లు అడిగే హక్కులేదు

హుస్నాబాద్: తెలంగాణ ఏర్పాటుపై అవమానకరంగా మాట్లాడిన నరేంద్ర మోదీ వ్యాఖ్యలను ఖండించని ఎంపీ బండి సంజయ్‌కు ఓట్లు అడిగే హక్కు లేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు మండిపడ్డారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ బండి సంజయ్ ఈ ప్రాంతానికి నయా పైసా పనిచేయలేదని ఆరోపించారు. అయిలయ్య, రాజు, బిక్యా నాయక్, కుమార్, రంజిత్, విక్రమ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సంక్షిప్త వార్తలు

◆ ఓబీసీ ఇన్‌చార్జిగా డా.సూర్యవర్మ



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మెదక్ పార్లమెంట్ ఓబీసీ ఇన్‌చార్జిగా జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ సూర్యవర్మను నియమిస్తూ తెలంగాణ ప్రదేశ్ ఓబీసీ సెల్ చైర్మన్, తెలంగాణ బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ తెలిపారు.

◆ బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడుగా రమణారెడ్డి



దుబ్బాక: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడుగా స్థానిక మల్లుగారి రమణారెడ్డి నియామకం అయ్యారు. సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి ఉత్తర్వులు అందజేశారు.

◆ కల్యాణోత్సవాలకు సర్వం సిద్ధం

మిరుదొడ్డి(దుబ్బాక): శ్రీరామనవమి సందర్భంగా 17న నిర్వహించే కల్యాణ మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సీతారామచంద్రస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం కల్యాణోత్సవ పత్రాలను ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు అప్పన్‌కందాడై పార్థసారథి, ఆలయ కమిటీ సభ్యులు అంజిరెడ్డి, నారాయణ, భిక్షపతి, మల్లేశం, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ ధ్వజస్తంభ యంత్రవిగ్రహ ప్రతిష్ఠ

దుబ్బాక: పట్టణంలోని మహంకాళి దేవాలయంలో 3రోజులుగా గణపతి సహిత ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారం వేదపండితులు జయరామశర్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ మల్లుగారి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ 50 మందికి నేత్ర పరీక్షలు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని కొండాపూర్‌లో సిద్దిపేట ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. 50మందికి నేత్ర పరీక్షలుచేసి అవసరమైన 10మందికి ఉచితంగా ఆపరేషన్ కోసం రిఫర్ చేశారు. వైద్యులు పావని, సీనియర్ ఫీల్డ్ ఆఫీసర్ నరేశ్, పంచాయతీ కార్యదర్శి అశోక్, మాజీ ఉపసర్పంచ్ బావు కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో 16 నుంచి 21 వరకు బ్రహ్మోత్సవాల నిర్వహణకు సర్వం సిద్ధమైంది. 16న ధ్వజారోహణం, 17న కల్యాణోత్సవం, 17న సామూహిక కుంకుమార్చనలు, 19న గరుఢ రథంపై ఊరేగింపు, 21న పూర్ణాహుతి ఉంటుందని ట్రస్టు నిర్వాహకులు తెలిపారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం

నంగునూరు(సిద్దిపేట): జేపీ తండాలో నూతనంగా నిర్మిస్తున్న దుర్గా, వీరాంజనేయ స్వామి దేవాలయానికి రంగదాంపల్లికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త వంగ రాజేశ్వర్‌రెడ్డి సోమవారం రూ.50వేలు విరాళం అందజేశారు. మాజీ సర్పంచ్ బుక్యా భిక్షపతినాయక్, లక్ష్మణ్‌నాయక్, వీరానాయక్, గొరబోయిన రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ మెదక్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్‌దే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మెదక్ పార్లమెంట్ స్థానం కాంగ్రెస్ పార్టీదేనని ఆపార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్, బీజేపీలు కాంగ్రెస్ పార్టీపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. రాష్ట్రంలో 17లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు.